బాధితుల పరిస్థితి నిలకడగా ఉంది

- ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు
- వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

అమరావతి,ఆంధ్రప్రభ: గుంటూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. గుంటూరులోని మూడు ప్రాంతాల నుంచి వాంతులు విరోచనాలకు గురై వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, వైద్య ఆరోగ్య ముఖ్య ప్రధాన కార్య దర్శి ఎంటీ కృష్ణబాబులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమ వారం పరామర్శించారు. వార్డుల్లోని బాధితులను కలిసి ఆరోగ్య సమస్యల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ప్రభు త్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వారు చెప్పారు. ఆసుపత్రి లో అందు తున్న వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

డయేరియాపై సమీక్ష..

బాధితులను పరామర్శించిన తర్వాత కృష్ణబాబు అధికారులతోడయేరియాపై సమీక్షించారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ ప్రతి వెయ్యి కుటుంబాలకు కలిపి ఆరోగ్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభావిత ప్రాంతాల పరిధిలో దాదాపు 23 వేల కుటుంబాలు ఉన్నాయని, ప్రతి కుటుంబాన్ని సర్వే చేసి తగు జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచనలు ఇస్తున్నామని, వాంతులు , విరేచనాలు వచ్చిన వెంటనే నగర పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత మూడు రోజుల నుంచి 75 కేసులు నమోదు కాగా ఇప్పటికే 15 మందిని డిశ్చార్జి చేశామని అయన తెలిపారు. గడచిన 24 గంటల్లో 20 మంది బాధితులు ఆసుపత్రికి రాగా 60 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. నగరంలోని మూడు ప్రాంతాల పరిధిలో మంచినీటి రిజర్వాయర్ ల నుంచి ఎక్కువగా కేసులు వచ్చినట్లు గుర్తించామని, నీటి సరఫరా చేస్తున్న రిజర్వాయర్ల నుంచి నీటి శాంపిల్స్ ను సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం నీటిలో ఫ్లోరిన్ బాగుందని వచ్చిన నివేదికలను బట్టి తెలుస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సర్జన్(ఆర్ఎంఓ) డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా... ముగింపు వేడుక నేడే

- సీఎం జగన్ చేతులమీదుగా బహుమతుల ప్రదానం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విశాఖపట్నం,ప్రభన్యూస్‌బ్యూరో: ఆడుదాం-ఆంధ్ర మెగా టోర్నీ ముగింపు కొచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ స్థాయిలోని మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రతిష్టాత్మకంగా 50 రోజుల పాటు నిర్వహించిన మెగా టోర్నీ ముగింపు ఉత్సవం మంగళవారం విశాఖపట్టణం వేదికగా జరగనుంది. విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరిగే ముగింపు ఉత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి పాల్గొని విజేతలకు విజేతలకు బహుమతులు, నగదు పురస్కారాలు అందించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి తననివాసం నుంచి బయలుదేరి 5.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా ఐటి హిల్‌నెంబర్ 3కు హెలికాప్టర్ ద్వారా చేరుకొని నేరుగా మధురవాడలోని స్టేడియంకు బయలుదేరి వెళ్తారు. 6 నుంచి రాత్రి 8 వరకు ముఖ్యమంత్రి అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తొలుత ప్రజలందరికి అభివాదం చేసి ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను ఆఖరి 5 ఓవర్లు వీక్షిస్తారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లైట్స్ షో, బాణా సంచా, డ్రోన్ షోలుతో పాటు సాంస్కృతిక కార్య క్రమాల ను ముఖ్యమంత్రి తిలకిస్తారు. అనంతరం క్రీడాకారులు,ప్రజలనుద్దేశించి ముఖ్య మంత్రి ప్రసంగించ నున్నారు. తదుపరి ఫస్ట్‌ఫ్లైజ్ విన్నింగ్ టీమ్‌ల కెప్టెన్‌లకు మెమోం టోలు అందజేస్తారు. అయితే అక్కడే పలు అభివృద్ధి పనులకు శంకుస్థా పనలు, ప్రారంభోత్సవాలు ముఖ్య మంత్రి చేస్తారని అధికార వర్గాల్లో ప్రచారం జరుగు తుంది. రాత్రి 8.5 గంటలకు మధుర వాడ క్రికెట్ స్టేడియం నుంచి బయలుదేరి 9.50కు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుం టారు. ముఖ్యమంత్రి రాక సంద ర్భంగా జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. మరో వైపు పోలీసులు భారీ బందోబస్తును నిర్వహిస్తున్నారు. సుమారు రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసి రాష్ట్రప్రభు త్వం రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం.. ఆంధ్రా పోటీలను నిర్వ హించింది. అయితే పోటీలు ఏ విధంగా నిర్వహిం చారో అంతకు రెట్టించి ముగిం పు వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు విశాఖలో గత కొద్ది రోజులుగా అనేక ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు.

ఇకపై ఏటా ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమ నిర్వహ ణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామీణ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపుతూ ఆరోగ్యం విషయంలో ఆటల ప్రాధాన్యతను వివరిస్తూ రాష్ట్రప్రభు త్వం ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మరో వైపు ప్రముఖ క్రీడాకారులు, సంస్థలను భాగస్వాములను చేసి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభా వంతులైన క్రీడాకారులను వెలుగులోకి తెచ్చి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిలపడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 50 రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆద్యంతం క్రీడా స్ఫూర్తితో క్రీడా సంబురాలు జరిగాయి. ఆడుదాం-ఆంధ్రా లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో 3.30 లక్షలు, మండలస్థాయిలో 1.24 లక్షలు, నియోజక వర్గస్థాయిలో 7,346, జిల్లాస్థాయిలో 1,731, రాష్ట్రస్థాయి లో 260 మ్యాచ్‌లను ప్రభు త్వం నిర్వహిం చింది.

ఇందుకు ఆంధ్రా క్రికెట్ అసోసి యేషన్‌తో పాటు వివిధ క్రీడా విభాగాలకు సంబం ధించిన అసోసియేషన్లు, ప్రో కబడ్డీ, బ్లాక్ హాక్స్ వాలీబాల్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వంటి ఫ్రాంచైజీల ద్వారా ప్రతిభ గల క్రీడాకా రులను ఎంపిక చేసి, వారికి శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇచ్చి, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేలా జగన్మో హన రెడ్డి ప్రభుత్వం తీర్చిదిద్దనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం-ఆంధ్ర క్రీడా యజ్ఞంలో 25 లక్షల 40వేల 972 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో పురుషులు 17,59,263 మంది కాగా మహిళా క్రీడాకారులు 7,81, 709 ఉన్నారు. వివి ధ ప్రాంతాల్లో నిర్వహించిన పోటీలను 80లక్షల మంది వీక్షించి క్రీడాకారుల్లో ఉత్సా హాన్ని నింపారు. క్రీడాకారు లకు దాదాపు రూ.37 కోట్ల విలువైన స్పోర్ట్స్ కిట్లు అందిం చిన ప్రభుత్వం రూ.12.21 కోట్ల నగదు బహుమతులు, మరెన్నో ఆకర్షణీయమైన బహుమతులను అందిస్తోంది.

ప్రజారోగ్యం ప్రభుత్వానికి పట్టదా?

అమరావతి,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోహెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించే పరిస్థితి వస్తే ప్రజలకు అండగా ఉంటామని వైద్యారోగ్య శాఖ మంత్రి చెప్పడం దారుణమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు విమర్శించారు. గడిచిన పది రోజుల్లో కలుషిత నీటిని తాగి అధికారికంగా ఇద్దరు, అనధికారికంగా పది మంది మరణించినట్లు తెలుస్తున్నదని, ఇంకా వేల సంఖ్యలో ఆసుపత్రుల పాలవుతున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని మండిపడ్డారు. సోమవారం టీడీపీ కేంద్రకార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, కలుషిత నీటివల్లే మరణాలు సంభవించినట్లుగా గుంటూరు ఆసుపత్రి సూపరిం టెండెంట్ స్వయంగా చెప్తే మంత్రి మాత్రం మీడియాపై చిందులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల ప్రాణాలు పోతుంటే వైద్యారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కలుషిత తాగునీటి సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని పైప్‌లైన్లలో డ్రైనేజీ వాటర్ కలుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలకు సంబంధించి రూ. 14 వేల కోట్ల నిధులను దారి మళ్లించడంపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేదని విమర్శలు చేశారు. కలుషిత నీటి మరణాలు, పేదలు ఆసుపత్రులు పాలవడానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని ఆయన విమర్శలు చేశారు.

వైసీపీ గుర్తింపును రద్దు చేయాలి

అమరావతి, ఆంధ్రప్రభ: అధికారాన్ని అడ్డం పెట్టుకుని వ్యవస్థల ద్వారా లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, చివరకు ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు అధికార యంత్రాం గాన్ని కూడా భ్రష్టు పట్టిస్తున్నదని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత కేఎస్ జవహర్ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో గెలుపు కోసం అధికారులను ప్రలోభ పెడుతూ అక్రమాలకు పాల్పడుతోందని తక్షణమే వైసీపీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల లాగిన్ ఐడీతో ఓటర్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు వైసీపీ పాల్పడిందని ఆ పార్టీ నిర్వాకం వల్ల అధికారులు బలైపోతు న్నారని విమర్శించారు. గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో సీఎం, మంత్రులు, అధికారుల సాయంతో అక్రమా లకు పాల్పడ్డారని ఆ తప్పులకు అధికారులను బలి పశువులను చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల తంతును అపహాస్యం చేస్తున్న వైసీపీ నేతలు గురుమూర్తి, మంత్రి పెద్దిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించాలని జవహర్ డిమాండ్ చేశారు.

గ్రూప్-2 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు 25న స్క్రీనింగ్ టెస్ట్

అమరావతి, ఆంధ్రప్రభ: గ్రూప్ 2 సర్వీసెస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 జిల్లా కేంద్రాలలో పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14వ తేదీ నుంచి పరీక్షల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరుకావాలని సూచించారు.

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏడు గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థ (ఎస్‌వోఈ/సీవీఈ)ల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలకు సంబంధించి (గురుకులం) నోటిఫికేషన్ విడుదల చేశారు. గిరిజన బాలబాలికలకు మాత్రమే ఈ గురుకులాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు మార్చి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తారు. అలాగే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇంటర్ ఎంపీసీలో 300 సీట్లు, బైపీసీలో 300 సీట్లు , 8వ తరగతిలో 180 సీట్లు అందుబాటులో ఉంచారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మే 05న మెరిట్ జాబితా వెల్లడిస్తారు. మే 20న మొదటి దశ, మే 25న రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

మార్క్‌ఫెడ్ ఎండీగా శేఖర్‌బాబు

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) మేనేజింగ్ డైరెక్టర్ గా గెడ్డం శేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరిం చారు. ఏపీ సీడ్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎం.డీగా ఉన్న ఆయనను ప్రభుత్వం మార్క్ ఫెడ్ కు బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఏపీ సీడ్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎం.డీగా ఎం.శివప్రసాద్ నియమితులయ్యారు. గ్రామ, వార్డు సచివా లయ అడిషనల్ డైరెక్టర్ గా అభిషేక్ గౌడ నియమితులయ్యారు. ఏపీ డెయిరీ డెవలప్ మెంట్ కోపరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్న ఏ.బాబును వ్యవసాయ మార్కెటింగ్, సహకార శాఖ కార్యదర్శిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నైపుణ్య విస్తరణపై.. ఎకో ఇండియాతో వైద్య ఆరోగ్య శాఖ ఒప్పందం

అమరావతి,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో అత్యుత్తమ సేవలు, నైపుణ్యాలను అందించే అంశంపై రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ డివిఎస్ఎల్ నరసింహం, ఎకో ఇండియా (ఎక్స్టెన్షన్ ఫర్ కమ్యూనిటీ హెల్త్ కేర్‌ఔట్ కమ్) సంస్థతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం మేరకు రాష్ట్రం లోని వైద్య విద్య డైరెక్టరేట్ పరిధిలో వున్న వైద్య, నర్సింగ్ కళాశాలలు, నర్సింగ్ స్కూళ్ళు, పారా మెడికల్ సంస్థలు తమ సిబ్బంది, విద్యార్థులకు వర్చువల్ పద్ధతిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎకో ఇండియా వేదికను ఉపయోగించు కునేందుకు అవకాశమేర్పడింది. ఈ శిక్షణా కార్యక్రమాల కోసం డిసీజ్ స్పెసిఫిక్ క్లినిక్ మేనేజ్మెంట్, రిక్రూటింగ్ కమ్యూనిటీ ప్లార్టర్స్, ఐటి టూల్స్(హార్డ్వేర్, సాఫ్ట్వేర్), కర్రికులం రిసోర్సెస్, శిక్షణా పరికరాలు, ప్రోటోకాల్స్ విధానాలు, రిసెర్చ్ డిజైన్, ఎవాల్యుయేషన్ ప్రోసెసెస్, రిసోర్సెస్, టూల్స్ వంటి కార్యక్రమాలు, వసతులను ఎకో సంస్థ అందుబాటులో వుంచుతుంది. దీంతో పాటు ఆయా సంస్థల అవసరాల మేరకు ఇతర శిక్షణా కార్యక్రమాలకు కూడా ఎకో ఇండియా సంస్థ సహకరిస్తుంది. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని డీఎంఇ కార్యాలయంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ మేరకు సంతకాలు చేసిన అవగాహనా పత్రాల్ని వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డివిఎస్ఎల్ నరసింహం, ఎకో ఇండియా సంస్థ ప్రాజెక్ట్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సందీప్ భల్లా పరస్పరం అందచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యా శాఖ (అకడమిక్) డైరెక్టర్ డాక్టర్ జి రఘునందన్, ఎకో ఇండియా సంస్థ ప్రాజెక్ట్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ దీపాఝా తదిత రులు పాల్గొన్నారు. ఎకో ఇండియా సంస్థ మన రాష్ట్రంతో పాటు గుజరాత్, జాతీయ ఆరోగ్య మిషన్‌తో కూడా అవగాహనా ఒప్పంద పత్రం కుదుర్చుకుంది. దీంతో పాటు విశాఖపట్టణంలోని హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్, ముంబైలోని టాటా మెమోరియల్ హాస్పిటల్ వంటి సంస్థలు కూడా ఎకో ఇండియాతో అవగాహన కుదుర్చుకున్నాయి.

ఈ సంస్థ తన శిక్షణా కార్యక్రమాలలో ప్రధానంగా వైద్యులు, నర్సులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థుల సామర్థ్య పెంపుపై దృష్టి సారిస్తుంది. ఉపన్యాసాలు, కేస్ చర్చలు, నైపుణ్య ప్రదర్శనలు, జాతీయ, అంతర్జాతీయ రిసోర్స్ పర్సన్ల ద్వారా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు, ఇ- లెర్నింగ్ ద్వారా ఎకో సంస్థ తన వేదిక నుండి అన్ని రకాల సాంకేతిక మద్దతును ఉచితంగా అందిస్తుంది.

సీఎం హామీ నిలబెట్టుకోవాలి

ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ

అమరావతి, ఆంధ్రప్రభ: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ముఖ్య మంత్రి ఇచ్చిన హామీ తక్షణమే నిలబెట్టుకోవాలని ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని, వేతనాలు నేరుగా ఇవ్వాలని, వేతనాల పెంపుదల బకాయిలు ఇవ్వాలని, ఉద్యోగుల డిఏ, పీఆర్‌సి బకాయిలు, ఓల్డ్ పెన్షన్ అమలుచేయాలనే తదితర డిమాండ్లతో ఏపి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ విజయవాడలోని ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ చైర్మన్ పి సుదర్శన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ వి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ పర్మనెంట్ ఉద్యోగులు చేస్తున్న పనినే కాంట్రాక్టు కార్మికులు చేస్తుంటే ఉద్యోగులతో సమానముగా వేతనం ఇవ్వాలని కోర్టుల తీర్పులు ఉన్న విద్యుత్ సంస్థల్లో అమలుకావడం లేదన్నారు. విద్యుత్ సంస్థల్లో ప్రమాదకరమైన పనుల్లో కూడా కాంట్రాక్టు కార్మికులను నియమిస్తూ తక్కువ వేతనాలు ఇస్తున్నారని, అలాగే విద్యుత్ సంస్థల్లో థర్డ్ పార్టీ విధానం రద్దు చేసి యాజమాన్యాలే డైరెక్ట్‌గా కార్మికులకు వేతనం చెల్లించాలని కోరారు. ఫలితంగా కాంట్రాక్టర్స్‌కు సూపర్‌వైజర్ చార్జీల పేరుతో కోట్లాది రూపాయలు అప్పనంగా చెలించాల్సిన అవసరం ఉండదన్నారు . విద్యుత్ ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో మూడు డిఏలు వెంటనే విడుదల చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని విద్యుత్ ఉద్యోగులకు అమలు పరచాలని, నగదు రహిత వైద్యం సౌకర్యం ఉద్యోగులకు అమలు జరగాలని కోరుతున్నామన్నారు . ధర్నాకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు హాజరై మద్దతు తెలిపారు . సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఏవి నాగేశ్వర రావు, కార్యదర్శి ఉమామహేశ్వర రావు మద్దతు తెలుపగా, ఈ ధర్నాలో నేతలు సూరిబాబు, మోహన్‌రావు, గంగయ్య, రాజు, చంద్రశేఖర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం- లారీ ఢీకొని ముగ్గురు మృతి

- 23 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

శ్రీసత్యసాయి , ప్రభన్యూస్ బ్యూరో : శ్రీ సత్యసాయి జిల్లా అగళి మండల పరిధిలోని ఇరిగేపల్లి హైవే పై ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా 23 మంది దాకా గాయాలయ్యాయి. డీఎస్పీ బాజీ జాన్ సైదా మడకశిర సీఐ మనోహర్ తెలిపిన మేరకు రొళ్ల మండలం దాసప్పన పాళ్యం గ్రామానికి చెందిన కరియన్న కుమారుడు మంజునాథ్ వివాహం కర్ణాటక రాష్ట్రం సిరా వద్ద మరిడిగుడ్డలో ఆది వారం జరిగింది. వివాహం అనంతరం అదే రోజు వధువు స్వగ్రామమైన ఉచ్చు గీర్నహళ్ళిలో రాత్రి భోజనం ముగించుకుని, రొళ్ల మండలం దాసప్పన్న పాలెం గ్రామానికి బొలెరో వాహనంలో వస్తుండగా అగళి మండలం ఇరిగేపల్లి హైవే రోడ్డులో సుమారు రాత్రి ఒంటిగంట సమయయంలో ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ని బొలెరో వాహనం ఢీకొనడంతో కాంతరాజు (47), అమ్మాజమ్మ (35), గోవిందప్ప (67) లో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన 23 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స కోసం బెంగళూరు, తుమకుకూర్,తదితర ప్రాంతాలకు తరలించినట్లు వారు తెలిపారు.

యాత్ర-2 దర్శకునికి భూమి కేటాయింపా?

అమరావతి, ఆంధ్రప్రభ: యాత్ర-2 సినిమా నిర్మాత, దర్శకుడు మహి వి రాఘవకు జగన్ సర్కార్ ఆంధ్రా ఊటీ హాల్సలీ హిల్స్‌లో రెండు ఎకరాల స్థలాన్ని కట్టబెట్టడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. యాత్ర-2 సినిమాలో నిజాలను మరుగుపరచి తన పాత్రను ఎలివేట్ చేసి, తనకు సొంత డబ్బా కొట్టినందుకుగాను జగన్మోహన్‌రెడ్డి ఆ సినిమా దర్శకుడు మహి వి రాఘవకి ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన హాల్సలీ హిల్స్‌లో 2 ఎకరాల భూ మిని ఆఘమేఘాల మీద కేటాయించడం గర్హనీయమని, రాఘవ తనకు అంత ఇష్టమైతే ఇడుపులపాయలో తన సొంత భూములు ఇస్తే ఎవ్వరికీ ఎటువంటి అభ్యంతరం ఉండదన్నారు.గత ప్రభుత్వం క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో మొదటి విడతగా 2 ఎకరాల స్థలాన్ని రాఘవకు కట్టబెట్టడం వెనుక సీఎం జగన్ యువజన వ్యతిరేక, కుట్రపూరిత మనస్తత్వం బహిర్గతమవుతోందన్నారు. జగన్ కేవలం తన స్వప్రయోజనాల కోసం మహి వి రాఘవకు రూ.20 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని పారితోషకంగా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తక్షణమే హార్స్లీ హిల్స్‌లో రాఘవకు భూమి కేటాయించడానికి విరమించుకోవాలని, ఆ భూమిని క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు.

వికసించిన తెలుగు తేజం

- ట్యాక్స్ అండ్ కస్టమ్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా నియామకం
- ఆల్ ఇండియా ఎస్సీ కేటగిరీలో రెండవ ర్యాంక్
- తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంక్

ఆరిలోవ,(విశాఖజిల్లా) ప్రభన్యూస్: గత సంవత్సరంలో నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌పోటీ పరీక్షల్లో విశాఖపట్నంజిల్లాఆరి లోవకు చెందిన అల్లంపల్లి ప్రవీణ్ సత్తా చాటారు.అల్ ఇండి యా ఓపెన్ కేటగిరీలో 476 ర్యాంక్, అల్ ఇండియా ఎస్సి కేటగిరీలో 2వ ర్యాంక్, తెలుగు రాష్ట్రాల ఎస్సీ కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించిశభాష్ అనిపించుకున్నారు. దీనితో సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్ డిపార్ట్మెంట్ విశాఖ పట్నంలో ఇన్‌స్పెక్టర్‌గా అల్లంపల్లి ప్రవీణ్ నియమితులయ్యారు.

తన తల్లి దండ్రులు అల్లంపల్లి రాజబాబు, నిర్మలా జ్యోతి ప్రోత్స హంతో ఈ విజయం సాధించినట్లు విద్యార్థి పేర్కొన్నారు. తనకుమారుడు ఇంజినీరింగ్ చదివి గతంలో టిసిఎస్‌లో సాఫ్ట్వేర్ ఇంజినీర్‌గా జాబ్ చేసి అనంతరం 2019లో మిని స్ట్రీ ఆఫ్ డిఫెన్సెలో ఆడి టర్ గా జాబ్ చేస్తూ తమ కుటుంబా నికి అండగా ఉంటూ ఎస్ఎస్‌సి పోటీ పరీక్షల్లో విజయం సాధించినట్లు తండ్రి రాజబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

బీజేపీలోకి వైసీపీ నేత ఏలూరి

పలువురు పారిశ్రామికవేత్తల చేరిక

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రకాశం జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త, వైసీపీ నేత ఏలూరి రామచంద్రా రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ కండువా కప్పి ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఏలూరి రామచంద్రారెడ్డి లాంటి నాయకుడు పార్టీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నట్టు పురంధేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లా డుతూ దేశం కోసం పనిచేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ఆశీస్సులతో బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. పార్టీ ఎలాంటి బాధ్యత అప్పగించినా తూచ తప్పకుండా పాటిస్తానని, వచ్చే ఎన్నికల్లో పార్టీ నిర్దేశించిన విధంగా పనిచేస్తానని ఏలూరి చెప్పారు. తాజాగా జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. రాజకీయంగా ప్రధాని నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు వచ్చే 50 ఏళ్లలో దేశాన్